క్లుప్తంగా

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



పెళ్లి కానుక అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి బీడీ కాలనీలోని గుల్జార్ బేగం, చౌడేపల్లి మండలం దాదేపల్లికి చెందిన షేక్ బహదూర్‌కు వివాహం నిశ్చయమైంది. వారికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని ఆదివారం వైఎస్సార్‌సీపీ చంద్రగిరి డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ రూప, ముస్లీం మైనారిటీ నాయకులు అందజేశారు.

వీసీఈఏ జిల్లా అధ్యక్షులుగా పద్మజ



వీసీఈఏ జిల్లా నూతన కమిటీ సభ్యులతో రాష్ట్ర నాయకులు

తిరుపతి రూరల్: విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్(వీసీఈఏ) తిరుపతి జిల్లా అధ్యక్షులుగా ఏజే పద్మజ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతి యూత్ హాస్టల్లో ఆదివారం అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రబాబు, ఉపాధ్యక్షులు దేవేంద్రనాథ్ పర్యవేక్షణలో జరిగిన ఎన్నికలకు అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షులుగా ఏజే పద్మజ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా వెంకటరమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా బీవీ పద్మజ, ప్రధాన కార్యదర్శిగా జానకీరామిరెడ్డి, కోశాధికారిగా సుబ్బరాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నాగరాజు, సంయుక్త కార్యదర్శిగా రాజశేఖర్, మహిళా కార్యదర్శిగా కల్పన ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎన్నికల అధికారి వెంకటేశ్వరరావు ప్రకటించారు. అనంతరం నూతన కార్యవర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు.


హైకోర్టు తీర్పు చంద్రబాబుకు చెంప పెట్టు



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ దళిత నేతలు

తిరుపతి కల్చరల్: రాజధాని అమరాతిలో ప్రభుత్వం ఇళ్ల కల్పిస్తే సహించలేని టీడీపీ నేత చంద్రబాబుకు హైకోర్టు తీర్పు చెంప పెట్టు వంటిదని వైఎస్సార్ సీపీ దళిత విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు తెలిపారు. హైకోర్టు తీర్పును స్వాగతిస్తూ మల్లారపు మధు ఆధ్వర్యంలో ఆదివారం చెన్నారెడ్డి కాలనీలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ భావజాలంతో పాలన సాగిస్తున్నారని తెలిపారు. రాజధాని అమరాతిలో దళితులకు భూములు ఇవ్వాలని నిర్ణయించడమే ఇందుకు నిదర్శనమన్నారు. దీన్ని సహించలేని చంద్రబాబు హైకోర్టులో పిటీషన్ చేశారని తెలిపారు. దీనిపై హైకోర్టు పేదలకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం హర్షణీయమన్నారు. అమరాతిలో పేదలకు స్థలాలు ఇవ్వడాన్ని చంద్రబాబు వ్యతిరేకించడాన్ని బట్టి చూస్తే పెత్తందారీలకు కొమ్ము కాయడమేనన్నారు. దళితుల అభ్యున్నతిని అడ్డుకునే చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

ధర్మం, భక్తి, జ్ఞానమార్గాలు మోక్షానికి దిక్సూచికలు



వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు, ఆశ్రమ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ధర్మం, భక్తి, జ్ఞాన మార్గాలు మోక్షానికి దిక్సూచికలని, వాటిని ఆచరించి మానవాళి తమ జీవితాలను సార్థకం చేసుకోవాలని శ్రీవేంకటేశ్వర వేద వర్సిటీ ఉపకులపతి రాణి సదా శివమూర్తి తెలిపారు. రామకృష్ణ మిషన్ ఆశ్రమం ఆవరణలో శనివారం శ్రీరామకృష్ణ మిషన్ 125వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషిలోనూ భగవంతుడిని చూసి సేవ చేయాలన్నారు. మానవాళికి సేవ చేసేందుకు ప్రతి నాగరిక దేశంలో ఆశ్రమాన్ని ప్రారంభించాలని రామకృష్ణ మిషన్ అధికారులను కోరారు. కడప రామకృష్ణ మిషన్ అధ్యక్షుడు స్వామి భీతి హరానందజీ మాట్లాడుతూ ప్రతి వ్యక్తీ సేవ చేయడాన్ని అలవర్చుకోవాలని కోరారు. రామకృష్ణ మిషన్ అభివృద్ధిలో శ్రీశారదా మాత పాత్రపై జి.శ్రీదేవి ఉపన్యసించారు. డాక్టర్ పీసీ రెడ్డి మాట్లాడుతూ భగవాన్ రామకృష్ణ ఆధ్యాత్మికతను, ఆధ్యాత్మిక యాత్రను, ఆయన సేవను మహాత్మా గాంధీ కొనియాడిని విధానాన్ని తెలియజేశారు.

రోడ్లు ప్రారంభం



రోడ్డు ప్రారంభంలో విజయేంద్ర సరస్వతి స్వామి, ఎమ్మెల్యే భూమన, ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష, ఎమ్మెల్సీ సిపాయి, డెప్యూటీ మేయర్లు



టీడీపీకి సెల్ఫీ చాలెంజ్ విసురుతున్న ఎమ్మెల్యే భూమన, ఎంపీ గురుమూర్తి, మేయర్ శిరీష, ఎమ్మెల్సీ సిపాయి, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు



ప్రజలతో మాట్లాడుతున్న విజయేంద్ర సరస్వతి స్వామి

తిరుపతి నగరంలో చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామి, తొండమాన్ చక్రవర్తి మాస్టర్ ప్లాన్ రోడ్లను ఆదివారం ప్రారంభించారు. ఇందులో కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లతో తిరుపతి నగరం దశ దిశ మారనుందని పలువురు నాయకులు తెలిపారు.

– తిరుపతి తుడా

యల్లమందలో పెట్రోల్ బంకు ప్రారంభం



పెట్రోల్, డీజల్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

భాకరాపేట: ఎర్రావారిపాళెం మండలం యల్లమంద గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు లక్ష్మీపతి నాయుడు ఏర్పాటుచేసిన ఎస్‌ఎల్‌వీ ఫిల్లింగ్ స్టేషన్ (ఇండియన్ ఆయిల్)ను ఆదివారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు ఇంధనం అందుబాటులోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శివలక్ష్మీ, జెడ్పీటీసీ కరుణాకర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, చెంగల్‌రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, మధుసూధనరెడ్డి, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్థానికంగా ఎదురయ్యే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ప్రజలు ఉదయం 9:30 నుంచి 10:30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్, ఉదయం 10:30 నుంచి స్పందనలో ఫిర్యాదులు అందజేయవచ్చు. సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లేందుకు 0877–2227208కు కాల్ చేయాలని అధికారులు సూచించారు.

శ్వేతకుమారికి మహిళా శాస్త్రవేత్త అవార్డు



కె.శ్వేతాకుమారి

తిరుపతి ఎడ్యుకేషన్ : పద్మావతి మహిళా యూనివర్సిటీలోని టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్‌లో ఇంక్యుబేషన్ మేనేజర్‌గా పనిచేస్తున్న కె.శ్వేతకుమారికి న్యూఢిల్లీలోని సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం(డీఎస్‌టీ) మహిళా శాస్త్రవేత్త అవార్డు ప్రకటించింది. స్టడీస్ టూ ఎక్స్‌ప్లోర్ ది మెకానిజం ఆఫ్ ప్లాంట్ హర్బివర్ ఇంటరాక్షన్ ఆల్టర్డ్ బై పారాసోడిస్ అండ్ పోలిడనవైరస్ అనే అంశంపై ప్రాజెక్టు మంజూరైనట్లు బయో సైన్స్ సెరికల్చర్ విభాగపు సీనియర్ ప్రొఫెసర్ డీఎం.మమత తెలిపారు. బయో సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు కె.శ్వేతకుమారికి రూ.26 లక్షలు డీఎస్‌టీ మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూమన, నైనార్ మధుబాల



పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న గ్రంథాలయాధికారి గజేంద్రబాబు

తిరుపతి మంగళం: ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చైర్మన్ నైనార్ మధుబాల తెలిపారు. ఆమె ఆదివారం పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డితో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. వివరాలకు 9700024409లో సంప్రదించాలని సూచించారు. చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్ఎస్.లావణ్య, అధికారులు శివప్రసాద్, ఎం.ధనుంజయులు, గురుప్రసాద్ పాల్గొన్నారు.

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి గ్రంథాలయంలో సోమవారం నుంచి ప్రత్యేక వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి రెడ్డెమ్మ ఆదివారం తెలిపారు. ఇందులో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు యోగా, డ్రాయింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రామా, చెస్, క్యారమ్స్, సంగీతం, డాన్స్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని, ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు ఉంటాయని పేర్కొన్నారు.

పాకాల: మండలంలోని దామలచెరువు గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి శిక్షణా తరగతులు ప్రారంభించనున్నట్లు గ్రంథాలయాధికారి గజేంద్ర తెలిపారు. ఆయన ఆదివారం పోస్టర్లు ఆవిష్కరించారు.

పాఠశాలకు జిరాక్స్ మెషిన్, ప్రింటర్ వితరణ



సమావేశమైన పూర్వ విద్యార్థులు

పాకాల: మండలంలోని దామలచెరువు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థులు జిరాక్స్ మెషిన్, ప్రింటర్‌ను వితరణ చేశారు. 1997–1998 బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. మధ్యాహ్నం అందరూ కలిసి భోజనాలు చేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌నాయుడు, గిరిరెడ్డి, దేవరాజుకు జిరాక్స్ మెషిన్, ప్రింటర్‌ను అందజేశారు.

ఘనంగా మేడే సాంస్కృతికోత్సవాలు



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

తిరుపతి కల్చరల్: మేడే వారోత్సవాల్లో భాగంగా యశోదానగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం మేడే సాంస్కృతికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ రమేష్‌నాథ్ లింగుట్ల, స్విమ్స్ వైద్యుడు మునస్వామి, తిరుపతి బాలోత్సవం గౌరవాధ్యక్షుడు టెంకాయల దామోదరం, టీటీడీ డెప్యూటీ ఈవో ఎ.ఆనందరాజు, ఎల్ఐసీ ఉద్యోగుల యూనియన్ నేత వై.కృష్ణకుమార్, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.నాగార్జున ఉత్సవాలను ప్రారంభించారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులు ఆలపించిన గీతాలు, నాట్య ప్రదర్శన, శ్రామిక గీతాలాపన, ప్రజానాట్య మండలి సభ్యులు గానం చేసిన విప్లవ గేయాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవాల్లో పాల్గొన్న చిన్నారులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఓపీ.రమణ, కడివేటి మునిరత్నం, ఆమూరి సుబ్రమణ్యం, రెడ్డెప్ప, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.సుబ్రమణ్యం, ఎం.గంగులప్ప, సీఐటీయూ నేతలు నాగ వెంకటేష్, వేణు, బుజ్జి, సుబ్రమణ్యం, డీవైఎఫ్ఐ నేత జయచంద్ర, ప్రజానాట్య మండలి సభ్యులు సెల్వరాజ్, వేణు పాల్గొన్నారు.

అకాల వర్షంతో ట్రాన్స్‌కోకు రూ.3 లక్షల నష్టం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో శనివారం రాత్రి కురిసిన అకాల వర్షం, ఈదురు గాలులతో 28 విద్యుత్ స్తంభాలు నేలకూలాయని ట్రాన్స్‌కో ఏఈ పుణ్యకోటి తెలిపారు. ఫలితంగా రూ. 3 లక్షలు నష్టం వాటిల్లిందని చెప్పారు. గాలికి స్తంభాలు విరిగిపోవడంతో పలు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిందన్నారు. ఈఈ వాసురెడ్డి, డిప్యూటీ ఈఈ సతీష్‌బాబు సహకారంతో యుద్ధ ప్రాతిపదికన పనులు చేస్తూ విద్యుత్‌ను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు.

పకడ్బందీగా నీట్ పరీక్షలు



హాల్ టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు





విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

తిరుపతి నగరంలో ఆదివారం నీట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. అధికారులు క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాత పిల్లలను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



పద్మావతి బాలికోన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రం బయట వేచి ఉన్న పిల్లల తల్లిదండ్రులు

చదువుల గుడి చంద్రగిరి జీహెచ్ఎస్

- జిల్లాలో రెండు, నాలుగు స్థానాలు స్కూల్ విద్యార్థులే
- అత్యధిక మార్కులు సాధించిన వారు పది మంది
- సత్ఫలితాలు ఇచ్చిన ప్రత్యేక శిక్షణ తరగతులు
- ప్రధానోపాధ్యాయురాలు విజయ



చంద్రగిరి ప్రభుత్వ బాలుర హైస్కూల్

తిరుపతి రూరల్: చంద్రగిరిలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో విజయదుందుభి మోగించారు. స్కూల్ ప్రారంభించిన 90 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా ఉత్తమ మార్కులతో జిల్లాల్లోనే టాప్ ఫోర్‌లో రెండు స్థానాలను కైవసం చేసుకున్నారు. పాఠశాలలో 128 మంది పరీక్షలకు హాజరుకాగా 79 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో 10 మంది 500లకు పైగా మార్కులు సాధించడం గమనార్హం. యోగీశ్వర్ జిల్లాలోనే ద్వితీయ, గణేష్ నాయక్ నాలుగో స్థానంలోనూ నిలిచారు. సంజయ్, రాహుల్, హీమేష్, ఇమ్రాన్, మునిపవన్, విష్ణువర్ధన్, అబ్దుల్ నవాజ్, శివబాలాజీ అత్యధిక మార్కులు సాధించారు. ఇంత మంది విద్యార్థులు ఐదు వందలకు పైగా మార్కులు సాధించిన స్కూల్ జిల్లాలోనే చంద్రగిరి బాలుర హైస్కూల్ మాత్రమే.

ప్రత్యేక శిక్షణా తరగతులతోనే..

పాఠశాలలో ఉత్తీర్ణత పెంచడంతో పాటు బాగా చదివే విద్యార్థులు ఇంకా మంచి మార్కులు సాధించేలా హెచ్‌ఎం విజయ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు ఉపాధ్యాయులు ప్రత్యేక బృందాలుగా తరగతులు నిర్వహించారు. దీంతో మంచి ఫలితాలు వచ్చాయి.

ఉపాధ్యాయుల సమష్టి కృషి వల్లే

ఉపాధ్యాయులు, విద్యార్థుల సమష్టి కృషి వల్లే ఇలాంటి ఫలితాలు సాధ్యమయ్యాయి. జిల్లాలోనే టాప్ ఫోర్‌లో ఇద్దరు విద్యార్థులు మా స్కూల్‌కు చెందిన వారు కావడం ఆనందంగా ఉంది. ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించిన ఉపాధ్యాయులకు, ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందనలు. –విజయ, హెచ్‌ఎం, ప్రభుత్వ బాలుర పాఠశాల, చంద్రగిరి

అన్నమయ్య గొప్ప సామాజిక వేత్త



మాట్లాడుతున్న భూమన సుబ్రమణ్యంరెడ్డి

తిరుపతి కల్చరల్: భగవంతుని దృష్టిలో మనుషులందరూ సమానమేనని తన సంకీర్తనల ద్వారా చాటి చెప్పిన తాళ్లపాక అన్నమాయ్య గొప్ప సామాజిక వేత్త అని శ్వేత మాజీ డైరెక్టర్ భూమన సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. అన్నమాచార్య కళామందిరంలో జరుగుతున్న అన్నమయ్య 615వ జయంతి ఉత్సవాలు ఆదివారంతో రెండవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సుకు అధ్యక్షత వహించిన భూమన్ అన్నమయ్య– సామాజికత అనే అంశంపై ఉపన్యసించారు. ఆయన పలు సంకీర్తనల్లో ఆనాటి గ్రామీణ పరిస్థితులు, పాడి పంటలు, సాగునీరు, కుటుంబ సంబంధాలు వంటి అంశాలను తెలియజేశారని తెలిపారు. తాను శ్వేత డైరెక్టర్‌గా పని చేసిన కాలంలో అన్నమయ్య స్ఫూర్తితోనే శ్వేతలో గిరిజన, దళిత, మత్స్యకార తదితర వర్గాల వారికి అర్చక శిక్షణ ప్రారంభించామని గుర్తు చేశారు. బెంగళూరుకు చెందిన అచార్య జీఎస్.మోహన్ అన్నమయ్య –పురందరదాసులు అనే అంశంపై ఉపన్యసించారు. ఇద్దిరి సంకీర్తనలు జానపద శైలిలో , సామాన్యప్రజలకు అర్థమయ్యేలా ఉంటాయన్నారు. విజయవాడకు చెందిన డాక్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అన్నమయ్య –దివ్య ప్రబంధములు అనే అంశంపై ఉపన్యసించారు. సాయంత్రం తిరుపతికి చెందిన జి.నాగేశ్వర నాయుడు బృందం నిర్వహించిన సంగీత కచేరి, తిరుపతికి చెందిన జ్యోత్స్ను బృందం హరికథాగానం భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు ఆకెళ్ల విభీషణ శర్మ, తుడా కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

ఇంటర్‌లో ముస్లిం విద్యార్థులకు ఉర్దూ భాష అవకాశం



ముస్లిం ప్రతినిధులతో చర్చిస్తున్న సయ్యద్ షఫీ అహ్మద్ ఖాద్రి

తిరుపతి కల్చరల్: పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్‌లో ఉర్దూ భాష సెకండ్ లాంగ్వేజ్‌గా తీసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షఫీ అమ్మద్ ఖాద్రి పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం స్థానిక అంజుమన్ తరక్కీ ఉర్దూ కార్యాలయంలో ముస్లిం ప్రతినిధులతో ఇంటర్‌లో విద్యార్థులకు ఉర్దూ భాష అవకాశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలనతో ప్రజల అభ్యున్నతికి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఉర్దూ భాషను అధికార భాషగా గుర్తించడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని ముస్లిం పిల్లలు సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముస్లింలు తమ పిల్లలను బాగా చదివించి ప్రయోజకులను చేయాలన్నారు. అంతేకాక ఇంటర్‌లో సెకండ్ లాగ్వేంజ్‌గా ఉర్దూను తీసుకునేలా ముస్లింలకు అవగాహన కల్పించి ముస్లిం విద్యార్థులను ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ ఫరీద్ సాహెబ్, షేక్ నిసార్ అమ్మద్, ఎస్వీయూ ఉర్దూ విభాగం షేక్ జాకీర్ హుస్సేన్, అంజద్‌అలిబేగ్, సయ్యద్ ఉస్మాన్ ఖాద్రి, షేక్ మున్నార్ పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధికి పెద్ద పీట

భాకరాపేట: గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేసినట్లు వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీలోని కొమ్మిశెట్టివారిపల్లె, యడమవారిపల్లె, గొల్లపల్లె, ఓరుగుంటవారిపల్లె, తిప్పారెడ్డిగారిపల్లె, కమ్మపల్లె, కోడేకంభంవారిపల్లె, కుమ్మరపల్లె, తిప్పిరెడ్డిగారిపల్లె, హరిజనవాడ, కొత్తపల్లె, టంగుటూరువాండ్లపల్లె, నాగేవాండ్లపల్లె గ్రామాల్లో గడప గడపకూ మహా పాదయాత్ర నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆప్యాయంగా పలుకరించారు. వారు పొందిన ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనేక చర్యలు తీసుకున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు నేరుగా పథకాలు అందుతున్నాయని వివరించారు. తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీలోని 13 గ్రామాల్లో రూ.9 కోట్లు మేర సంక్షేమ నిధులు అందాయన్నారు. అలాగే రూ.5.43 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రఘునాథరెడ్డి, కుమార్‌రెడ్డి, శివారెడ్డి, హరి, బాలాజీ, సుబ్రమణ్యం, రమణ, వెంకటేష్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడికి మోహిత్‌రెడ్డి నివాళి



గురుప్రకాష్‌కు నివాళులర్పిస్తున్న మోహిత్‌రెడ్డి

భాకరాపేట: భాకరాపేట ఘాట్‌రోడ్డులో జరి గిన ప్రమాదంలో మృతి చెందిన గురుప్రకాష్ కు వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నివాళులర్పించారు. భాక రాపేట బీసీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ వార్డు మెంబరు ఈశ్వరయ్య కుమారుడు గురుప్రకాష్ శనివారం తిరుపతి వెళుతూ ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మోహిత్‌రెడ్డి భాకరాపేటకు చేరుకుని ఈశ్వరయ్య కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ స్వరూప, సర్పంచ్ భూపాల్, డివిజన్ అధ్యక్షుడు గురుశంకర్, మహేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఐ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలి

తిరుపతి కల్చరల్: ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లను తక్షణమే సస్పెండ్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాక్రిష్ణ డిమాండ్ చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం గాంధీ విగ్రహం సర్కిల్‌లో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఆటో డ్రైవర్ మధును కొంతమంది ట్యాక్సీ డ్రైవర్లు కొట్టి గాయపరిచారని, దీనిపై తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశామన్నారు. ఎస్ఐ శ్రీనివాసులు ఆదివారం ఫిర్యాదుదారునికి ఫోన్ చేసి కేసును ఎఫ్ఐఆర్ చేశామని, తీసుకువెళ్లాలని చెప్పారని పేర్కొన్నారు. మధు తమ్ముడు రాజశేఖర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎఫ్ఐఆర్ తీసుకున్నారని, అందులో బలమైన సెక్షన్లు లేవని అడిగిన రాజశేఖర్‌ను ఎస్ఐ కొట్టడంతో పాటు లోపలకి తీసుకెళ్లి మరో ఏడుగురు కానిస్టేబుళ్లతో తీవ్రంగా బెల్టుతో కొట్టడం దారుణమన్నారు. అడిగిన పాపానికి ఒక డ్రైవర్‌ను ఈ విధంగా కొట్టం ఏ చట్టం కింద వస్తుందో సంబంధిత పోలీసులు చెప్పాలని ప్రశ్నించారు. అన్యాయంగా కొట్టిన ఎస్ఐ, సహకరించిన కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ నేత చిన్నం పెంచలయ్య, ఏఐటీయూసీ నేతలు శ్రీరాములు, కేవై.రాజా, ఆటో వర్కర్స్ యూనియన్ నేతలు పాల్గొన్నారు.